క్లుప్తంగా

మంత్రిని కలిసిన నాయకులు

జూలూరుపాడు: రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ గురువారం ఏన్కూర్‌లో సీతారామ ప్రాజెక్టు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జూలూరుపాడు మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు అక్కడకు వెళ్లి మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. జూలూరుపాడు సొసైటీ చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి, ఎంపీటీసీ దుద్దుకూరి మధుసూధన్ రావు, పార్టీ మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్ నాయక్ నాయకులు పాల్గొన్నారు.

అత్యవసర సేవలు అందించండి


మాట్లాడుతున్న మధువరన్

ఇల్లెందురూరల్: వైద్య సిబ్బంది అత్యవసర సేవల పట్ల నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఎన్‌సీడీ పీఓ మధువరన్ అన్నారు. కొమరారం పీహెచ్‌సీలో కొమరారం, రొంపేడు పీహెచ్‌సీల పరిధిలోని వైద్యసిబ్బందికి ఎన్‌సీడీ పోర్టల్ ప్రక్రియపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. మాట్లాడుతూ.. గ్రామాలలో ప్రధానంగా బీపీ, షుగర్ కలిగి ఉన్న వారిని గుర్తించి విధిగా ఎన్‌సీడీ పోర్టల్‌లో వారి వివరాలను ఆన్‌లైన్ చేయాలన్నారు. అవసరమైన మందులను అందజేయాలని సూచించారు. సమావేశంలో డాక్టర్ లోహిత, డాక్టర్ కవిత తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం


నగదు అందజేస్తున్న నాయకులు

పాల్వంచ: విద్యార్థిని చదువుకు టీఆర్‌వీకేఎస్ నాయకులు ఆర్థిక సాయం అందించారు. మండలంలోని దంతెలబోర గ్రామానికి చెందిన వంటసాల విజయదుర్గ పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించి ప్రతిభ కనబర్చింది. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఉన్నత చదువులకు వెళ్లలేక ఇబ్బంది పడుతోంది. గురువారం స్థానిక సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీఆర్‌వీకేఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చారుగుండ్ల రమేశ్ చేతుల మీదుగా విజయదుర్గకు రూ.37వేలను అందించారు. కార్యక్రమంలో దంచనాల రాంబాబు, ఆర్.శ్రీనివాస్, తోట కోటేశ్వరరావు, ముత్యాల రాంబాబు, అచ్చ కోటిలింగం, ఎండీ.సుభాని, పి.విజయ్, శంకర్, కాలే కాంతయ్య, ధర్మపురి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ


విత్తనాలు తీసుకెళ్తున్న రైతులు

జూలూరుపాడు: స్థానిక సహకార సంఘం కార్యాలయంలో గురువారం పచ్చిరొట్ట విత్తనాలు (జీలుగు, జనుము) పంపిణీ చేశారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తుండటంతో ఎక్కువ సంఖ్యలో రైతులు వాటిని కొనుగోలు చేసేందుకు వచ్చారు. మండల వ్యవసాయ అధికారి ఎస్.రఘుదీపిక పర్యవేక్షణలో విత్తనాలను పంపిణీ చేపట్టారు. 30 కిలోల జీలుగు విత్తనాలు సబ్సిడీ పోను రూ.1,116, 40 కిలోల జనుము విత్తనాలు సబ్సిడీ పోను రూ.1,448 రైతులు చెల్లించి తీసుకున్నారు.

తొమ్మిదేళ్లుగా రోడ్డు పనులు..

బ్రిటీష్ కాలం నుంచి ఉన్న రహదారి అది. దశాబ్దాలుగా ప్రజల విన్నపాలు గాలికొదిలేసిన పాలకులు ఎట్టకేలకు బీటీ రోడ్డు నిర్మాణం కోసం అనుమతులు మంజూరు చేశారు. కానీ రోడ్డు నిర్మాణానికి అటవీశాఖ అడ్డుగోడగా నిలిచింది. అటవీశాఖ క్లియరెన్స్ కోసం సర్వే చేసిన పంచాయతీరాజ్ శాఖ అధికారులు పరిహారం చెల్లింపును కాగితాలకే పరిమితం చేయడంతో రహదారి నిర్మాణం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది.

- మొండితోగు రోడ్డుకు వీడని గ్రహణం
- అటవీశాఖ అనుమతి కోసం సర్వే
- కాగితాలకే పరిమితమైన పరిహారం చెల్లింపు
- రోడ్డు సాకర్యం లేక అవస్థలు పడుతున్న ప్రజలు


వర్షాలకు కొట్టుకుపోతున్న రోడ్డు

ఇల్లెందురూరల్: మొండితోగు గ్రామపంచాయతీ చారిత్రక నేపథ్యం ఉంది. బ్రిటీష్ పాలన కాలంలోనే ఈ ప్రాంతంలోని గ్రీన్ గ్రానైట్ తవ్వకాల పనులు చేపట్టారు. ఆ రోజుల్లోనే బ్రిటీష్ అధికారులు రవాణా కోసం మట్టి రోడ్డును వేశారు. కానీ నేడు అదే రోడ్డుపై బీటీ పరిచేందుకు అటవీశాఖ అనుమతుల కోసం కొర్రీ పెట్టటం ప్రజలను విస్మయానికి గురిచేసింది. ఎట్టకేలకు 2015లో నాటి పాలకులు మొండితోగు గ్రామపంచాయతీలో బీటీ రోడ్డు నిర్మాణం కోసం అనుమతులు జారీ చేశారు. మండలంలోని ఇల్లెందు పట్టణం నుంచి గుండాల వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారి నుంచి మొండితోగు గ్రామ పంచాయతీ పరిధిలో, ధర్మాపురం వరకు 6.6 కిలోమీటర్ల దూరంలో రూ.3.14 కోట్ల వ్యయంతో బీటీ రోడ్డు వేయడానికి అప్పటి ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు 2015లో శంకుస్థాపన చేశారు. దీంతో తమ గ్రామాలకు పక్కా రోడ్డు సౌకర్యం ఏర్పడుతుందని మొండితోగు గ్రామపంచాయతీ ప్రజలు ఆనందపడ్డారు. కానీ వారి ఆనందం ఆచరణలోకి రావడానికి అటవీశాఖ అడ్డుగోడగా నిలిచింది.

2016లోనే పూర్తయిన జాయింట్ సర్వే...

అటవీశాఖ అభ్యంతరంతో పంచాయతీరాజ్, అటవీశాఖల అధికారులు జాయింట్ సర్వే నిర్వహించారు. రహదారి నిర్మాణం వల్ల 3.9 కిలోమీటర్ల దూరంలో మొత్తం 2.57 హెక్టార్ల భూమి అటవీశాఖ కోల్పోతుందని అంచనా వేశారు. అందులో కోల్పోతున్న అటవీ సంపదను కూడా వెలకట్టి మొత్తంగా రూ.22.80 లక్షలు పరిహారంగా చెల్లించాలని అటవీశాఖ ఉన్నతాధికారులు పంచాయతీరాజ్‌శాఖ ముందుంచారు. ప్రత్యామ్నాయంగా చెల్లించాల్సిన నిధుల మంజూరుకు అనుమతి కోరుతూ పంచాయతీరాజ్ శాఖ అధికారులు ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. ఆయా నిధుల మంజూరు నాటి నుంచి పే అండ్ అకౌంట్స్ పరిధిలో ఉండిపోయింది. ప్రభుత్వం నుంచి నిధులు నేటికీ విడుదల కాకపోవడంతో రహదారి నిర్మాణ పనులు కాగితాలకే పరిమితమయ్యాయి.

వర్షాలతో ఛిద్రమవుతున్న రహదారి...

2015లో మంజూరైన బీటీ రోడ్డును ఇల్లెందు–గుండాల ఆర్‌అండ్‌బీ రహదారి నుంచి రెండు కిలోమీటర్ల దూరం బీటీ పర్చారు. మొండితోగు గ్రామంలో 700 మీటర్ల దూరం సీసీ పరిచారు. ఆ తరువాత మిగిలిన 3.9 కిలోమీటర్ల దూరంలో రోడ్డు నిర్మాణం నేటికీ ముదుకు సాగడం లేదు. నాడు రోడ్డు నిర్మాణం కోసం బాగు చేసిన రహదారి ఏటా కురుస్తున్న వర్షాలతో క్రమంగా మరీ అధ్వానంగా మారుతోంది. పంచాయతీలోకి వచ్చిన ప్రతీ ఉన్నతాధికారికి, ప్రజాప్రతినిధికి రహదారి దుస్థితిపై ఆ ప్రాంత ప్రజలు అందజేసిన వినతిపత్రాలు అరణ్యరోధనగానే మిగిలిపోతున్నాయి.

పెద్దలు తలుచుకుంటేనే..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అటవీశాఖ అభ్యంతరాలతో నిలిచిపోయిన రహదారుల నిర్మాణంపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పందించి అనుమతులు మంజూరు చేయాలని అటవీశాఖ ఉన్నతాధికారులకు ఇటీవల లేఖ రాశారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ 2015లో నాడు ఆర్‌అండ్‌బీ మంత్రిగా ఉన్న సమయంలో మొండితోగు బీటీ రోడ్డు నిర్మాణం కోసం తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. నాటి నుంచి అటవీశాఖ అనుమతులు లేక రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోయాయి. అటవీశాఖ, పంచాయతీరాజ్ శాఖలు జాయింట్ సర్వే చేసి చెల్లించాల్సిన పరిహారం కూడా నిర్ణయించినప్పటికీ నిధుల విడుదల లేనికారణంగా నేటికీ పనులు ముందుకు సాగడం లేదు. తాజాగా మంత్రి హోదాలో తుమ్మల నాగేశ్వరరావు అటవీశాఖకు రాసిన లేఖలో మొండితోగు గ్రామాన్ని కూడా చేర్చి నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అనుమతులు మంజూరు చేయాలి..



మొండితోగు గ్రామం నుంచి ధర్మాపురం వరకు అటవీశాఖ అభ్యంతరంతో బీటీ రోడ్డు నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. నాడు రోడ్డు మంజూరు చేయించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మరోసారి చొరవ తీసుకొని అటవీశాఖ క్లియరెన్స్ ఇప్పించాలి. నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలి.

– ఊకం సమ్మయ్య, ధర్మాపురం

రోడ్డు లేక ఇబ్బంది పడుతున్నాం..



మొండితోగు నుంచి ధర్మాపురం వరకు రహదారి అధ్వానంగా ఉండటం వల్ల రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. విత్తనాలు, ఎరువుల కొనుగోళ్లు, పంట ఉత్పత్తుల విక్రయం సమస్యగా ఉంటోంది. పిల్లలు బడికెళ్లాలన్నా అవస్థలు తప్పడం లేదు. పెద్దలు స్పందించి రహదారి నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయించాలి.

– దొడ్డ భాగ్యలక్ష్మి, ధర్మాపురం

నివేదిక ఇచ్చాం..



మొండితోగు నుంచి ధర్మాపురం వరకు రోడ్డు సర్వే నిర్వహించాం. మొత్తంగా 2.57 హెక్టార్ల భూభాగం అటవీశాఖ కోల్పోతున్నట్లు గుర్తించాం. అటవీశాఖ సూచన మేరకు రూ.22.80 లక్షలు ప్రత్యామ్నాయంగా చెల్లించేందుకు ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చాం. నిధులు విడుదల కాగానే పనులు ప్రారంభిస్తాం.

– రాజు, ఏఈ, పంచాయతీరాజ్‌శాఖ, ఇల్లెందు మండలం

పర్యావరణ పరిరక్షణకు కృషి


మాట్లాడుతున్న జీఎం జాన్‌ఆనంద్

ఇల్లెందు: వాతావరణంలో మార్పులకు కారణమైన పర్యావరణ పరిరక్షణకు ప్రతీఒక్కరు పాటు పడాలని జీఎం జాన్‌ఆనంద్ తెలిపారు. గురువారం ఇల్లెందులోని జీఎం కార్యాలయంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వాతావరణంలో మార్పుల కారణంగా ప్రతీచోటా సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని తెలిపారు. హిమనీనదులు కరిగిపోతున్నాయని, నదులు ఎండిపోతున్నట్లు చెప్పారు. ఈ క్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన మిషన్ లైఫ్ ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. అనంతరం ఉద్యోలందరూ ప్రకృతిని కాపాడుతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓటూ జీఎం మల్లారపు మల్లయ్య, ఏరియా ఇంజనీర్ నరసింహరాజు, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, డీజీఎం సర్వే బాలాజీ నాయుడు, ఎన్విరాన్‌మెంట్ అధికారి ధనుంజయరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

వాహన నిర్వహణకు టెండర్ ఆహ్వానం

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియాలోని వర్క్‌షాప్‌లో అద్దె వాహన నిర్వహణకు రెండు డబ్ల్యూడీ క్యాంపర్ జీప్ వాహనాల కోసం టెండర్ కోరుతున్నట్లు జీఎం జాన్‌ఆనంద్ తెలిపారు. గురువారం ఇల్లెందులో మాట్లాడుతూ.. జూన్ 15వ తేదీ నాటికి దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. దరఖాస్తు ఫీజు రూ.590 చెల్లించి జీఎం కార్యాలయంలో ఫైనాన్స్ విభాగం దరఖాస్తు ఫారం పొందవచ్చని చెప్పారు.

పెన్షన్ అదాలత్‌లో సమస్యలు పరిష్కారం...

సింగరేణి ఉద్యోగులకు, మాజీ ఉద్యోగులకు పెన్షన్, సీఎంపీఎఫ్ సమస్యల పరిష్కారం కోసం ఆఫీసర్స్ క్లబ్‌లో నిర్వహించిన అదాలత్‌లో సమస్యలు పరిష్కరించినట్లు జీఎం జాన్‌ఆనంద్ తెలిపారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో కొత్తగూడెం సీఎంపీఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ కనకమ్మ ఉద్యోగులతో మాట్లాడుతూ.. ప్రతీ నాలుగు నెలలకోసారి ఆదాలత్‌తో సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు.

పంచవర్ష ప్రణాళికలో బకాయిలు చేర్చాలి


మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ చేపట్టనున్న పంచవర్ష ప్రణాళికలో సంస్థకు రావాల్సిన రూ.26 వేల కోట్ల అంశాన్ని చేర్చాలని, హెచ్‌ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ అన్నారు. గురువారం సింగరేణి ప్రధాన కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంస్థకు మణిహారం కానున్న నైనీ బ్లాకులో సంవత్సరానికి పది మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసే మణిహారం నేడు 'మనీ'హారం కాబోతోందన్నారు. మృతి చెందిన ఇంజనీర్ కిరిటీ కుటుంబాన్ని పరామర్శించడానికి వచ్చిన ముగ్గురు డైరెక్టర్లు సమీక్ష జరపడం సరైందేనా అని ప్రశ్నించారు. కిరిటి మృతికి కారకులైన విజిలెన్స్ అధికారులపై లాకప్‌డెత్ కేసు నమోదు చేయాలని, ఈ ఘటనపై ఏసీబీతో విచారణ చేయించాలని కోరారు.

మారని కాంట్రాక్ట్ కార్మికుల స్థితిగతులు

దేశానికి స్వాతంత్రం వచ్చి 75 ఏళ్లయినా, 135 సంవత్సరాల చరిత్ర కలిగిన సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికుల స్థితిగతులు మారలేదని, ఇందుకోసం మరో ఉద్యమానికి శ్రీకారం చుట్టాలని హెచ్‌ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ అన్నారు. గురువారం కొత్తగూడెంలోని గెస్ట్ హౌస్‌లో జరిగిన సింగరేణి కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యల పరిరక్షణకై ఐక్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి సంస్థ రూ.కోట్ల లాభార్జనలో ఉన్నా కార్మికుల జీవితాలు దుర్భరంగా ఉన్నాయన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి ఆందోళనా కార్యక్రమాలకు కార్మికులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గడిపెల్లి కృష్ణప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ ఆంజనేయులు, ఏరియా సెక్రటరీ ఆసీఫ్, జి.రమేష్, యాకూబ్, జాన్ ప్రభాకర్, బాలచందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీపరుడిని గెలిపించండి


ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

జూలూరుపాడు: వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి గెలుపు కోసం బీజేపీ నాయకులు గురువారం జూలూరుపాడులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి రమేష్, బీజేపీ మండల అధ్యక్షుడు సిరిపురపు ప్రసాద్, నాయకులు పట్టభద్రుల ఓటర్ల ఇంటికి వెళ్లి ప్రేమేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ... ఈనెల 27న జరిగే వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో విద్యావంతుడు, నిజాయితీపరుడు, తెలంగాణ ఉద్యమకారుడు బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రేమేందర్ రెడ్డికి గ్రాడ్యుయేట్లు తమ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో సిరిపురపు గోపాల్‌రావు, పుల్లారావు, కిరణ్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రాకేష్‌రెడ్డిని ఆదరించాలి..


ఇల్లెందు: ప్రచారం చేస్తున్న నాయకులు

ఇల్లెందు: బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ మాజీ ఎమ్మెల్యే హరిప్రియ, జిల్లా గ్రంథాలయ కమిటీ మాజీ చైర్మన్ దిండిగల రాజేందర్ పట్టణంలో పట్టభద్రులను కలిసి ఓటు అభ్యర్థించారు. గురువారం పార్క్‌లో, సింగరేణి స్కూల్ గ్రౌండ్‌లో, ప్రభుత్వ కార్యాలయాల్లో, కోర్టు ఏరియాలో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు సిలివేరు సత్యనారాయణ, రంగనాథ్, పరుచూరి వెంకటేశ్వర్లు, అబ్దుల్ నబీ, గిన్నారపు రాజేష్, హరికృష్ణ, రాచపల్లి శ్రీను, నెమలి నిఖిల్, నీలం శేఖర్, రవికాంత్, రవి, ముత్తయ్య పాల్గొన్నారు.

టేకులపల్లి: వరంగల్ – ఖమ్మం – నల్గొండ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మెర్ల వరప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం బోడు గ్రామంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎల్.సురేందర్‌రావు, భద్రం, ప్రసాద్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు వైరాలో బీఆర్ఎస్ పార్టీ సమావేశం

జూలూరుపాడు: వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ వైరాలో శుక్రవారం బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తలు, గ్రాడ్యుయేట్లతో సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్సీ ఎన్నికల వైరా నియోజకవర్గ ఇన్‌చార్జ్ లకావత్ గిరిబాబు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. వైరాలోని కమ్మవారి కల్యాణ మండపంలో మధ్యాహ్నం 12 గంటలకు సమావేశం ఉంటుందని తెలిపారు. ఈ సమావేశానికి బీఆర్ఎస్ నాయకులు, ముఖ్యకార్యకర్తలు, పట్టభద్రులు అధిక సంఖ్యలో హాజరై ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

వైస్ ఎంపీపీ ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి

ఇల్లెందురూరల్: ఇల్లెందు వైస్‌ఎంపీపీ ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఎన్నికల అధికారి రామకృష్ణ, ఎంపీడీఓ ధన్‌సింగ్ గురువారం తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు ఎన్నిక ఉంటుందని, మండలంలోని ఎంపీటీసీలకు సమాచారం అందించామని చెప్పారు. ప్రతిపాదన, ఓటింగ్ పద్ధతిలో ఎన్నిక నిర్వహిస్తామన్నారు.

నిబంధనలకు విరుద్ధం


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కామేష్

సూపర్‌బజార్(కొత్తగూడెం): నిబంధనలకు విరుద్ధంగా డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (డీసీహెచ్‌ఎస్)గా విధులు నిర్వహిస్తున్న రవిబాబును తొలగించాలని. ఆయన బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి జరిగిన నియామకాలు, కాంట్రాక్ట్ పనులపై విచారణ జరిపించాలని కోరుతూ బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యర్రా కామేష్ గురువారం కలెక్టర్ డాక్టర్ ప్రియాంకకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రవిబాబు కంటే అనుభవం ఉన్న డాక్టర్లు జిల్లాలో అందుబాటులో ఉన్నప్పటికీ డీసీహెచ్‌ఎస్‌గా రవిబాబును నియమించడం నిబంధనలకు విరుద్ధమన్నారు.

విత్తనాలు సకాలంలో అందించాలి


వ్యవసాయ శాఖ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

టేకులపల్లి: రైతాంగానికి ఎరువులు, విత్తనాలను సకాలంలో అందించాలని నకిలీ విత్తనాలు అరికట్టాలని బ్యాంకు రుణాలు మాఫీ చేసి నూతన రుణాలు ఇవ్వాలని అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బుర్రా వెంకన్న, సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ టేకులపల్లి మండల కార్యదర్శి డి.వీరబ్రహ్మాచారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆ సంఘం ఆధ్వర్యంలో టేకులపల్లి వ్యవసాయ అధికారికి డిమాండ్‌తో కూడిన వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ... దేశానికి వెన్నెముక అయిన రైతాంగాన్ని ఆదుకోవడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని, రైతులకు ఎరువులు, విత్తనాలు కూడా సకాలంలో అందించకపోవడం, నకిలీ విత్తనాలు పంపిణీ చేయడం లాంటి చర్యలతో రైతన్న తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు వ్యవసాయ ఉత్పత్తుల పరికరాలు, ట్రాక్టర్లు సబ్సిడీపై అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జరుపుల సుందర్, కుక్క ముడిప్రసాద్, టి.బాలు, గల్క భద్రం, రాజు, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నను 'మండలి'కి పంపించండి..


కొత్తగూడెంరూరల్: మాట్లాడుతున్న దిలీప్‌కుమార్


ఇల్లెందు: ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

సింగరేణి(కొత్తగూడెం): ప్రజా సంఘాలు, వివిధ పార్టీలు బలపరుస్తున్న ఖమ్మం, వరంగల్, నల్గొండ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను అత్యధిక మెజారిటీతో గెలిపించి శాసనమండలికి పంపించాలని 1969 ప్రత్యేక తెలంగాణ సమరయోధుల సంఘం నాయకులు వి.శాంతిరామ్ కోరారు. గురువారం సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట వారు ప్రచారం నిర్వహించి, సింగరేణి ఉద్యోగులను ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో హరిగోపాల్, చింతల చెర్వు గెర్షోము, జ్యోతి, మల్లీశ్వరి పాల్గొన్నారు.

పాల్వంచ: పట్టభద్రుల నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించాలని కాంగ్రెస్, సీపీఐ నాయకులు కోరారు. గురువారం మున్సిపాలిటీ కార్యాలయం, జిల్లా కేంద్ర సహకార బ్యాంక్‌లో ఉద్యోగులను కలుసుకుని ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌కె.సాబీర్ పాషా, ముత్యాల విశ్వనాథం, వీసంశెట్టి పూర్ణ, ఉప్పుశెట్టి రాహుల్, నూకల రంగారావు పాల్గొన్నారు.

కొత్తగూడెంరూరల్: కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న అత్యధిక మెజారిటీతో గెలిపించాలని టీపీసీసీ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ కమిటీ కన్వీనర్ కపిలవాయి దిలీప్‌కుమార్, కోకన్వీనర్ కత్తి వెంకటస్వామి అన్నారు. గురువారం మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయంలో జిల్లా ఎమ్మెల్సీ ఎన్నికల కోఆర్డినేటర్, టీపీసీసీ సభ్యులు నాగ సీతారాములు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, ఎస్‌కే సాబీర్‌పాషా, అన్నవరపు కనకయ్య, తోటదేవీ ప్రసన్న తదితరులు ఉన్నారు.

ఇల్లెందు: పట్టణంలోని ఆంబజార్లో గురువారం ఎమ్మెల్యే కోరం కనకయ్య పట్టభద్రుల ఇంటింటికి వెళ్లి ఓటు అభ్యర్థించారు. కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారం చేశారు.

తీన్మార్ మల్లన్నను గెలిపించండి..

ఎమ్మెల్సీ ఎన్నికల్లో తీన్మార్ మల్లన్నను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పట్టభద్రులను కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు డానియేల్, మున్సిపల్ వైస్ చైర్మన్ జానీపాషా, మున్సిపల్ మాజీ చైర్మన్, వైస్ చైర్మన్ యదళ్లపల్లి అనసూర్య, పులిగళ్ల మాధవరావు కోరారు. గురువారం ఇల్లెందు పట్టణంలో తీన్మార్ మల్లన్న విజయాన్ని కాంక్షిస్తూ విస్తృతంగా పట్టభద్రులను కలిసి ఓటు అభ్యర్థించారు.

టేకులపల్లి: ఎన్నో ఆశలు, ఆశయాలతో తెచ్చుకున్న తెలంగాణ ప్రజల ఆశలన్నింటినీ తుంగలో తొక్కి కేసీఆర్ కుటుంబం అధికారం, సంపాదనకే పరిమితమైందని తెలంగాణ జన సమితి (టీజేఎస్) రాష్ట్ర కార్యదర్శి మల్లెల రామనాథం అన్నారు. ఈ మేరకు గురువారం టేకులపల్లి మండల కేంద్రంలో టీజేఎస్, కాంగ్రెస్ నాయకులతో కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో భూక్యా దేవా నాయక్, ధర్మయ్య గౌడ్ పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: మిత్రపక్షాలు బలపరిచిన కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న విజయాన్ని కాంక్షిస్తూ గురువారం కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. నాగారంకాలనీ, జగన్నాథపురం, రంగాపురం గ్రామాల్లో డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, యర్రంశెట్టి ముత్తయ్య, కొండం వెంకన్న, తుమ్మల శివారెడ్డి పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు


ఇల్లెందురూరల్: మాట్లాడుతున్న డీఎస్పీ చంద్రభాను


పాల్వంచరూరల్: విత్తన దుకాణంలో తనిఖీ నిర్వహిస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

జూలూరుపాడు: నకిలీ విత్తనాలను రైతులకు విక్రయిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయశాఖ అధికారి(ఏఓ) ఎస్.రఘుదీపిక హెచ్చరించారు. గురువారం స్థానిక సహకార సంఘం కార్యాలయంలో విలేకరులతో ఆమె మాట్లాడారు. పత్తి విత్తనాలను డీలర్ల వద్ద రైతులు కొనుగోలు చేయాలని, తప్పనిసరిగా బిల్లులు పొందాలన్నారు. విత్తనాలను ఎంఆర్‌పీకే అమ్మాలని, నాసిరకమైన విత్తనాలను రైతులకు అంటగట్టి మోసానికి పాల్పడిన వ్యాపారులపై కేసు నమోదు చేయడం జరుగుతుందన్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల వివరాలు దుకాణాల్లోని స్టాక్ బోర్డుపై నమోదు చేయాలని వ్యాపారులకు సూచించారు. దుకాణాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో విస్తృతంగా తనిఖీలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ ఏడాది మండల వ్యాప్తంగా 26 వేల ఎకరాల విస్తీర్ణంలో పత్తి, మిరప, వరి, మొక్కజొన్న, కూరగాయలు, అపరాలు వంటి పంటలు సాగు చేసేందుకు వ్యవసాయశాఖ ప్రణాళిక సిద్ధం చేసిందన్నారు. పత్తి 17 వేల ఎకరాలు, మిరప 5 వేల ఎకరాలు, వరి 3,700 ఎకరాలు, ఇతర పంటలు 300 ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేయనున్నట్లు చెప్పారు. పత్తి పంట సాగుకు 80 వేల పత్తి ప్యాకెట్లు అవసరం కాగా, ఇప్పటి వరకు 10 వేల ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని, సీజన్ ప్రారంభమయ్యే నాటికి పూర్తి స్థాయిలో పత్తి విత్తనాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

పాల్వంచరూరల్: నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని టాస్క్‌ఫోర్స్ ఏడీఏ వాసవిరాణి అన్నారు. స్థానిక పట్టణంలోని పలు విత్తన విక్రయ దుకాణాలను గురువారం టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఆయా దుకాణాల్లోని విత్తన ప్యాకెట్లు, రిజిస్టర్లను తనిఖీ చేశారు. వ్యవసాయశాఖ అధికారి శంకర్ ఉన్నారు.

ఇల్లెందురూరల్: నకిలీ విత్తనాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ చంద్రభాను సూచించారు. కొమరారంలో గురువారం రైతులతో ఆయన సమావేశమయ్యారు. మాట్లాడుతూ.. రైతులు విత్తనాలను లైసెన్స్ ఉన్న దుకాణాలలో మాత్రమే కొనుగోలు చేయాలని, రశీదు తప్పక తీసుకోవాలని చెప్పారు. రశీదును పంటకాలం పూర్తయ్యే వరకు భద్రంగా ఉంచుకోవాలన్నారు. పలానా విత్తనం వాడితే అధిక దిగుబడి వస్తుందని, తక్కువ ధరకే లభిస్తాయని ఎవరు చెప్పినా నమ్మొద్దని చెప్పారు. ఎవరైనా రశీదు ఇవ్వకున్నా, నకిలీ విత్తనాలు విక్రయించినా పోలీసులకు, వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమావేశంలో గుండాల సీఐ రవీందర్, కొమరారం ఎస్సై సోమేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి...

విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల దుకాణాల నిర్వహణలో నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏడీఏ వాసవీరాణి హెచ్చరించారు. మండలంలోని సుదిమళ్ల రైతువేదికలో విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల విక్రయదారులతో గురువారం సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ.. ప్రతీ వ్యాపారి విత్తనాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. మార్కెట్‌లోకి నకిలీ విత్తనాలు వస్తే వెంటనే తమకు సమచారాం అందించాల్సిన బాధ్యత కూడా స్థానిక వ్యాపారులపై ఉంటుందని చెప్పారు.